క్లుప్తంగా

జాతీయ స్థాయిలో రాణించాలి



విద్యార్థులతో ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు

జైపూర్: విద్యార్థులు కరాటే పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించాలని, కరాటేతో విద్యార్థులు శారీరకంగా ధృడత్వాన్ని పెంచుకోవచ్చని ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు తెలిపారు. జైపూర్ సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటులో ఆదివారం సాయంత్రం ఎస్టీపీపీ ఆడిటోరియల్‌లో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో విద్యార్థులకు బెల్ట్, ధృవీకరణ పత్రాలు అందించారు. జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థిని జనని, విద్యార్థులను ప్రోత్సహిస్తున్న డీజీఎం పంతులానాయక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటి ఎస్టీపీపీకి మంచి గుర్తింపు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరాటే కోచ్‌లు రాజనర్సు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వాము దగ్ధం

నెన్నెల: మండలంలోని ఆవుడం గ్రామానికి చెందిన జాడి లింగయ్య అనే రైతుకు చెందిన గడ్డి వాము ప్రమాదవశాత్తు సోమవారం దగ్ధమైనట్లు బాధిత రైతు తెలిపారు. మధ్యాహ్నం సమయంలో గడ్డివాము దగ్గర మంటలు చెలరేగడంతో గమనించిన చుట్టు పక్కల యువకులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. రైతుకు చెందిన రెండు ఆవులు ప్రమాదం బారి నుంచి తప్పించుకొని గాయాలతో బయటపడ్డాయి. దగ్ధమైన గడ్డి విలువ సుమారు రూ.30వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

మహామ్మాయిదేవి శోభాయాత్ర



మంగళహారతులతో మహిళలు

చెన్నూర్: చెన్నూర్ విశ్వకర్మభవన్‌లో ఏర్పాటు చేసిన మహామ్మాయిదేవి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సురేశ్ బాబు ఆధ్వర్యంలో విశ్వకర్మ భవనంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పురవీధుల్లో మహిళల మంగళహారతుల మధ్య అమ్మవారి శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, కులస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రీమియర్‌లీగ్ క్రికెట్ పోటీల విజేత అంకుశం జట్టు

తాండూర్: తాండూర్‌లో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ పోటీల్లో అంకుశం కింగ్స్ 11పంజాబ్ జట్టు విన్నర్‌గా నిలవగా, ఢిల్లీ క్యాపిటల్స్ తాండూర్ శివాజీ జట్టు రన్నర్‌తో సరిపెట్టుకుంది. అంజనీపుత్ర ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్, ఆపిల్ డెంటల్ క్లీనిక్ మాసాడి కీర్తి వర్ధన్, సార్ల రమేష్‌ల సౌజన్యంతో క్రికెట్ పోటీలు జరిగాయి. విజేతలుగా నిలిచిన ఇరు జట్లకు తాండూర్ సీఐ కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరు కాగా డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, ఎస్సై సాగర్, కిష్టంపేట నాయకుడు సార్ల రమేష్, అంజనీ పుత్ర ఎస్టేట్స్ ప్రతినిధులు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు మైదం అనిల్‌కుమార్, మాసాడి శశివర్ధన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాటర్ సప్లై ఇన్‌చార్జి డీఈగా మధుకర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ వాటర్ సప్లై డీఈగా మధుకర్‌ను నియమించారు. పబ్లిక్ హెల్త్ డీఈగా పనిచేస్తున్న ఆయన్ను వేసవి దృష్ట్యా మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు ఉండకూడదనే గతంలో మంచిర్యాల కార్పొరేషన్ డీఈగా పనిచేసిన మధుకర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

'నకిలీ రిజిస్ట్రేషన్‌లు వెంటనే ఆపాలి'

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని సర్వే నంబర్ 170లో ఉన్న ప్రభుత్వ ఖాళీ భూములకు నకిలీ పత్రాలతో జరుగుతున్న రిజిస్ట్రేషన్‌లను వెంటనే ఆపాలని ఎంసీపీఐ (యూ)జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేష్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని కమిషనర్‌అండ్ ఇన్స్‌స్పెక్టర్, జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. తప్పుడు రిజిస్ట్రేషన్‌ల పై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

ఒక్క సీసీకెమెరా వంద మందితో సమానం. అంతటి ప్రాముఖ్యత కలిగిన నిఘా నేత్రాల ఏర్పాటుకు వివిధ వ్యాపారవర్గాలు ముందుకు రావడం లేదు. దొంగతనాల నివారణ, రోడ్డు ప్రమాదాలు, చోరీకి పాల్పడుతున్న దొంగల గుర్తింపు కోసం వీటిని ఇళ్లల్లో, షాపుల్లో, రహదారుల వెంట ఏర్పాటు చేయాల్సి ఉండగా తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోంది. బెల్లంపల్లిలో ఇటీవలి కాలంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. చోరీలకు పాల్పడుతున్న గుర్తు తెలియని వ్యక్తులు భయాందోళన కలిగిస్తున్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు నిఘా నేత్రాలపై అవగాహన కల్పిస్తున్నా మార్పు కనిపించడం లేదు. – బెల్లంపల్లి



నిఘాపై నిర్లక్ష్యం

- సీసీకెమెరాల ఏర్పాటుకు ముందుకురాని వ్యాపారులు
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ఫలితం శూన్యం
- పట్టణంలో పెరుగుతున్న దొంగతనాలు

సీసీ కెమెరాలు లేకపోవడంతో..

చోరీకి పాల్పడుతున్న వ్యక్తులు ఎంతో నేర్పుగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా ఏఏ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేవో ముందస్తుగానే గుర్తించి చోరకళను ప్రదర్శిస్తున్నారు. ఇటీవల కాల్‌టెక్స్ ఏరియాలో రెండు ఇళ్లలో దొంగతనం చేసి దర్జాగా బైక్‌లపై వెళ్లారు. ఆ ప్రాంతంలో ఏ ఒక్క చోట కూడా సీసీ కెమెరా లేకపోవడం దొంగలకు బాగా కలిసి వచ్చింది. ముందస్తుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల దొంగతనాలు నివారించే అవకాశాలు ఉన్నాయి. కానీ ఆ దిశగా ప్రజలు, వ్యాపార వర్గాలు ముందడుగు వేయలేకపోతున్నారు. కాగా వారం క్రితం కూరగాయల వ్యాపారులు చందాలు వేసుకుని 16 సీసీకెమెరాలను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలవడం గమనార్హం.

నిద్రావస్థలో..

బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులు ఉన్నాయి. వీటన్నింటిలో నిఘా నేత్రాలు లేవు. ప్రజా ప్రతినిధులు, వ్యాపారవర్గాలు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా సరైన సానుకూలత వ్యక్తం కావడం లేదు. కొంత కాలం క్రితం ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాల్లో కొన్ని ప్రస్తుతం నిద్రావస్థలో ఉన్నట్లు తెలుస్తోంది. వీటికి వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. అదేతీరుగా వార్డులవారీగా, షాపుల్లో, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయించి వారి ద్వారా సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే సత్ఫలితాలు వస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దొంగతనాల నేపథ్యంలో నిఘా పటిష్టం చేసి రాత్రిపూట పోలీసు పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది.

సీసీకెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత



ప్రస్తుత రోజుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అత్యంత అవసరం. వీటిని ఏర్పాటు చేసేందుకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నాం. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం, నేను సైతం వంటి కార్యక్రమాల ద్వారా సీసీకెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇటీవల కూరగాయల వ్యాపారులు ముందుకు వచ్చి 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇతర వర్గాల వారు కూడా ముందుకు రావాలి.

– ఏ.రవికుమార్, ఏసీపీ, బెల్లంపల్లి

ఇటీవల జరిగిన దొంగతనాలు..

- సుమారు ఆరు నెలల క్రితం బెల్లంపల్లి బజారు ఏరియాలో ఉన్న ఐదు దుకాణాల్లో ఒకేరోజు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి నగదు పట్టుకెళ్లారు.
- బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన దుర్గం వెంకటస్వామి అనే వ్యక్తి గత ఫిబ్రవరి 7వ తేదిన బజారు ఏరియా ఎస్‌బీఐ బ్యాంకు నుంచి రూ.4.40 లక్షలు డ్రా చేసుకుని బైక్ పెట్రోల్ కవర్‌లో ఉంచగా పట్టపగలు ఇద్దరు యువకులు చాకచక్యంగా డబ్బు దొంగతనం చేశారు.
- తాజాగా బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలోని రెండు ఇళ్లలో చొరబడి 19.1/2 తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ.90 వేల నగదు, 4 మోటారు సైకిళ్లను దొంగలు పట్టుకెళ్లారు.

ప్రజావాణిలో భూ సమస్యలే అధికం

జన్నారం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భూ సమస్యలపై రెండు దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్ తెలిపారు. ఎంపీడీవో ఉమర్ షరీఫ్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

కాసిపేట: స్థానికంగా నిర్వహించిన గ్రీవెన్స్‌లో భూ సమస్యలకు సంబంధించి మూడు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ఒకటి మొత్తం నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ భోజన్న తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, వ్యవసాయాధికారి ప్రభాకర్, పశు వైద్యాధికారిణి సరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తదితరులున్నారు.

దండేపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో భూ సమస్యలపై రెండు ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. ఎస్సై తహసీనొద్దీన్ పాల్గొన్నారు.

తాగునీరు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలి

కోటపల్లి: మండలంలోని తహసీల్దార్, ఎంపీడీవో, టీజీబీ బ్యాంక్, ప్రభుత్వ ఆసుపత్రి, అగ్రికల్చర్ కార్యాలయాలకు అవసరాల కోసం వచ్చిన ప్రజలకు వేసవికాలం దృష్ట్యా తాగునీటిని అందుబాటులో ఉంచాలని ప్రజావాణిలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మపున్నం తహసీల్దార్ రాఘవేంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



కోటపల్లి: వినతిపత్రం అందజేస్తున్న ఎర్మ పున్నం

రాష్ట్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోంది

- ఉచిత రేషన్ ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమే
- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్

మంచిర్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వమే ప్రజలకు రేషన్‌షాపుల ద్వారా ఉచితంగా బియ్యం అందిస్తుందని, కాని రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యాన్ని ఇస్తున్నట్లుగా తప్పుడు ప్రచారం చేస్తుందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని గర్మిళ్లలో సోమవారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ నూతన గద్దెను ఆవిష్కరించిన అనంతరం, దగ్గరలోని రేషన్‌షాపుకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. గత ఐదేళ్లుగా నరేంద్రమోడీ ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పేరుతో తామే బియ్యం అందిస్తున్నట్లు ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక కిలో బియ్యం మాత్రమే, వారి వాటా కింద ప్రజలకు ఇచ్చి తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ పార్టీల ఫ్లెక్సీలను పెడుతూ వారే ఉచితంగా బియ్యాన్ని అందిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. అనంతరం రేషన్‌షాపుల్లో ఉన్న సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి, లబ్ధిదారులకు కనీస సదుపాయాలు కల్పించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం, ఆకుల అశోక్‌వర్ధన్, అమిరిశెట్టి రాజ్‌కుమార్, కంకణాల సతీశ్, జోగుల శ్రీదేవి, కాశెట్టి నాగేశ్వర్‌రావు, జోగుల శ్రీదేవి, శివశంకర్, సుదర్శన్ పాల్గొన్నారు.



రేషన్ షాప్ వద్ద ప్రజలతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్

రాజ్యాంగ విలువలు కాపాడాలి

లక్సెట్టిపేట: ప్రజలు రాజ్యాంగ విలువలపై అవగాహన కలిగి ఉండాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ సమావేశంలో మాట్లాడారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేశారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను కాపాడాలని, పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చెల్ల నాగభూషణం, పింగిళి రమేష్, పూర్ణచందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

భక్తమార్కండేయస్వామి విగ్రహ ప్రతిష్ట

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి పునరావాస కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం శ్రీభక్త మార్కండేయ స్వామి విగ్రహంతో పాటు శిఖర కళశం, నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించారు. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిపి పూర్ణాహుతితో హోమాన్ని ముగించారు. పద్మశాలీలు చేనేత మగ్గంతో ట్రాక్టర్లో గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా వచ్చి స్వామివారికి పట్టు వస్త్రం సమర్పించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ తదితరులు ఆలయానికి వచ్చి మార్కండేయ స్వామిని దర్శించుకున్నారు.



వేషధారణలో భక్తులు

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం



ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర



గూడెంలో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తూ..

దండేపల్లి/తాండూర్/మందమర్రిరూరల్: తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లోని శ్రీకోదండ రామాలయంలో, మందమర్రి పట్టణంలోని మూడో జోన్‌లో గల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో సోమవారం శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ముద్దు అవధూతశర్మ, వెంకటాచారి ఆధ్వర్యంలో ఔపోసన బలి హరణ కార్యక్రమాలు నిర్వహించి భక్తిప్రపత్తులతో హోమం చేశారు. దండేపల్లి మండలంలోని గూడెం గ్రామంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు.

జిల్లా కేంద్రంలో శోభాయాత్ర

మంచిర్యాలఅర్బన్: స్థానిక మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బస్టాండ్ నుంచి విశ్వనాథస్వామి దేవస్థానం వరకు సీతారాముల ఆంజనేయ ఉత్సవ విగ్రహాలు, రాముని పాదుకలతో శోభయానంగా శోభాయాత్ర నిర్వహించారు. అంతకుముందు హోమం కాల్చారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గాజుల రాజేశ్‌గౌడ్, వేణుగోపాల్, హనుమాన్ దీక్షాపరులు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో వినియోగదారుల సేవా శిబిరం

బెల్లంపల్లి: బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బెల్లంపల్లిలో వినియోగదారుల సేవా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డీఈ బి.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మార్కెట్ ఏరియాలో సేవా శిబిరం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు వినియోగదారుల సేవా మాసంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదులు, బిల్లులకు సంబంధించిన సమస్యలు, ఇతర సేవలపై సలహాలు, సూచనలు చేయడానికి అవకాశం ఉందని తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లా కేంద్రంలో నిరసన దీక్ష

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో బీసీ జేఏసీ, బీసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10గంటలకు నిరసన దీక్ష

నేటి సమాచారం

చేపట్టనున్నట్లు బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ సోమవారం తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించే జనాభా లెక్కల్లో సమగ్ర కులగణన జరిపించాలని, తెలంగాణలో విద్యా ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42శాతానికి రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని ఎన్డీఏ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించాలని, బీసీ రిజర్వేషన్‌ల బిల్లును 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలనే డిమాండ్‌లతో బీసీ ఉద్యమకారుడు బత్తుల సిద్దేశ్వర్ ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సందర్భంగా ఆయన దీక్షకు మద్దతు ప్రకటిస్తూ జిల్లా కేంద్రంలో నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. దీక్షకు జిల్లాలోని బీసీ సంఘాల నాయకులు, మేధావులు, అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమిని: కన్నెపల్లి ఫీడర్‌లో మంగళవారం చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు మెయింటనెన్స్ పనులు చేపట్టనున్నట్లు భీమిని ఏఈ రాజనర్సు తెలిపారు. భీమిని, జన్కాపూర్, కన్నెపల్లి, నాయకునిపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్‌లో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఇంజనీర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాతన్‌పల్లి, మందమర్రి మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కార్మికులకు మెరుగైన వైద్య సేవలు

- జీఎం ఎం. శ్రీనివాస్

శ్రీరాంపూర్: సింగరేణి కార్మిక కుటుంబాలకు కంపెనీ మెరుగైన వైద్య సేవలందిస్తుందని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. ఆర్కే 8 డిస్పెన్సరీలో అంతర్జాతీయ వైద్య దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కంపెనీ అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పిస్తుందన్నారు. అనంతరం ఫిజియోథెరపీ విభాగంలో నూతనంగా కొనుగోలు చేసిన పరికరాలను ఆయన ప్రారంభించారు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు.

రక్తదాన శిబిరం..

యువ ఉద్యోగులతో రక్తదాన శిబిరం నిర్వహించగా, శ్రీరాంపూర్ వీటీసీలో శిక్షణ పొందుతున్న 80మంది యువ ఉద్యోగులు రక్తదానం చేశారు. వారిని జీఎం అభినందించి, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఏరియా ఎస్‌ఓటుజీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, డీవైసీఎంవో రమేష్‌బాబు, వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, వీటీసీ మేనేజర్ కల్లూరి వెంకట రామారావు, డీవైపీఎం రాజేష్, వైద్యులు లోక్‌నాథ్ రెడ్డి, వీటీసీ ట్రైనర్ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న జీఎం

వడదెబ్బపై అవగాహన

శ్రీరాంపూర్: వేసవిలో తగిన జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బకు దూరంగా ఉండొచ్చునని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే 6 గనిలో వేసవి ఎండలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కల్పించారు. ఎండ సమయంలో బయటకి వెళ్లేటప్పుడు తలకు టోపీ, కాటన్ దుస్తులు ధరించాలన్నారు. తరచూ మంచినీళ్లు, మజ్జిగ ఇతర ద్రవపానీయాలు తీసుకోవాలన్నారు. ఎండకు వెళ్లి వచ్చిన తర్వాత నీరసంగా ఉన్నా, తలనొప్పిగా ఉన్నా వెంటనే ఓఆర్‌ఎస్ తీసుకోవాలన్నారు. వైద్యుని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో గండి మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, సీనియర్ పీవో సురేందర్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ సంఘం సదానందం, నాయకులు అద్దు శ్రీనివాస్, రాంచందర్, సంతోశ్‌కుమార్, క్రాంతికుమార్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోక్‌నాథ్ రెడ్డి

బొగ్గుబాయి వార్తలు

సమ్మె విజయవంతం చేయండి

శ్రీరాంపూర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న జరిగే దేశవ్యాప్త టోకెన్ సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకులు సారయ్య, బ్రాంచీ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'భూగర్భ గనుల మూతతో భవిష్యత్ ఆగం'

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో భూగర్భగనులు ఒక్కొక్కటిగా మూతపడుతుండడంతో ఏరియా భవిష్యత్ ఆగమవుతుందని హెచ్‌ఎమ్మెస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏరియాలోని హెచ్‌ఎమ్మెస్ యూనియన్ ఆఫీస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాలోని కేకే-1, ఆర్కే-1ఏ భూగర్భ గనుల్లో బొగ్గు నిలువలు ఉన్నప్పటికీ, యాజమాన్యం కావాలనే ఉద్దేశపూర్వకంగా మూసివేసిందని ఆరోపించారు. గెలిచిన సంఘాలు యాజమాన్యానికే వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపించారు. నూతన గనుల ఏర్పాటు కోసం హెచ్‌ఎమ్మెస్ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనుందని, కార్మికలోకం కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సుదర్శన్, శ్రీనివాస రెడ్డి, రామస్వామి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

గ్లైఫోసెట్‌తో పర్యావరణానికి ముప్పు

వేమనపల్లి: గ్లైఫోసెట్ గడ్డి మందు స్ప్రే చేయడం వల్ల పర్యావరణానికి, ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదమని మండల వ్యవసాయాధికారి వీరన్న, ఎస్సై శ్యాంపటేల్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ అధికారుల సమన్వయంతో నకిలీ విత్తనాలు, గ్లైసిల్ మందు వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్సై శ్యాంపటేల్, మాజీ సర్పంచ్ రాంచందర్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే మానవ ఆరోగ్యం

చెన్నూర్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మానవ ఆరోగ్యం బాగుటుందని చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ సత్యనారాయణ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కాయకల్ప కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రం నుంచి గాంధీచౌక్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బాలికలకు కరాటే ఆత్మస్థైర్యం

దండేపల్లి: బాలికలకు కరాటే ఆత్మస్థైర్యం అని ఎస్సై తహసీనొద్దీన్ అన్నారు. కరాటే, మంకిఫిస్టులో ప్రతిభ కనబరుస్తున్న మండలంలోని పలువురు బాలికలు సోమవారం ఎస్సైని కలిశారు. బాలికలు కరాటే నేర్చుకుంటే మంచిదని, తోటి బాలికలకు కూడా నేర్పించాలని ఎస్సై సూచించారు. కరాటే మాస్టర్ అంజన్న ఉన్నారు.

చైతన్య కుటుంబానికి అండగా...

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ స్పాట్‌వాల్యుయేషన్ క్యాంపులో కోడింగ్ విధుల్లో పాలుపంచుకొని, అనారోగ్యంతో మృతిచెందిన అధ్యాపకురాలు చైతన్య కుటుంబానికి సహాయంగా రూ. 81వేలు విరాళాలు సేకరించారు. చెక్కును క్యాంపు ఆఫీసర్, డీఐఈవో కటుకం అంజయ్యకు అందజేశారు.

చత్రాడకు పాదయాత్ర

వేమనపల్లి: మండల కేంద్రంతో పాటు ఒడ్డుగూడం, సుంపుటం, దస్నాపూర్ గ్రామాలకు చెందిన హన్మాన్ దీక్షాపరులు సోమవారం కొమురంభీం జిల్లా చత్రాడలోని హన్మాన్ ప్రశాంతదామ్‌కు పాదయాత్రగా వెళ్లారు.

రూ.60వేలు విరాళం

చెన్నూర్: చెన్నూర్ అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్మించిన హనుమాన్ మందిర్ అభివృద్ధి కోసం ఆలయ నిర్వాహకులకు రూ.60వేల విరాళాలను ఏబీజేఏ నాయకులు నూక శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేసినట్లు ఆర్యవైశ్య జై వాసవి వ్యవస్థాపకులు టీఎల్ సుధాకుమార్ తెలిపారు.